# కాటు

రైలుబండి వస్తున్న జాడలే లేవు. కొన్నేళ్ళక్రితమైతే కొండల మధ్యనించి కొండచిలువలా పాకుతూ, ఎత్తుగా పెరిగిన చెట్లలోనుంచి గుప్పున పొగ వదులుకుంటూ స్టేషన్లోకి వచ్చేది రైలు.

ఇప్పుడో? ఆ మార్గాన్ని విద్యుదీకరణ చేసేశారు. చుక్ చుక్ మంటూ పొగవదులుతూ- వికృతమైన చప్పుళ్ళు చేసుకుంటూ నత్తలా నడిచే ఆ రైలింజన్ వదిలించి విద్యుత్తుతో నడిచే చప్పుడులేని ఇంజన్ని తగిలించారు.

ఎంత పెళ్ళుమంటోంది. అయినా అక్కడంతా నీడగానే వుంది. స్టేషనో గుమ్మటాల్లా పెరిగిన చెట్లలోనించి ఎండ కిందికి జారుతోంది.

స్టేషన్ మాస్టరు తన గదిలో కూర్చుని ఎవరో మరో రైలు ఉద్యోగితో హస్కు కొడుతున్నాడు.

అప్పటికే అక్కడ కట్టెల మోపులు మోసుకొచ్చి చెట్లకింద నిల్చున్న మనషులు వుండీ వుండి రైలు దూసుకొచ్చే టన్నెల్లోకి చూస్తున్నారు. స్టేషన్‌కు కొంచెం దూరంలోనే వుంది ఆ సొరంగం. కొండను తొలిచివేసిన మార్గం. చడీచప్పుడు లేకుండా మాటువేసి మీదికి దూకే అడవి జంతువులా ఒక్కసారి ఆ టన్నెల్లోనించి బయట పడుతుంది రైలు.

ఉదయం పదిగంటల వేళ వచ్చే ఆ రైలుబండి కోసం ఎన్నో జతల కళ్ళు ఆశగా ఎదురు చూస్తుంటాయి.

నిజానికి ఆ స్టేషన్లో ప్రయాణీకులంటూ ఎవరూ దిగరు. ఎప్పుడైనా ఒకరు - లేకపోతే ఇద్దరూ దిగుతారు. ఎవరైనా దిగటానికి, అక్కడికి రావటానికి ఏముందని? ఎత్తయిన ఆ కొండల మధ్యగా పేరుకు ఓ రైలు స్టేషన్ వుంది. ఆ స్టేషన్లో పనిచేసే వుద్యోగుల నాలుగిళ్ళు, ఆ వెనగ్గా ఎక్కడో దూరంగా ఓ పాతిక గుడిసెలూ వున్నాయి. అదో వూరు. దాని పేరు – కరకవలస.

అసలీవేళ రైలు వస్తుందా?


ఆడవాళ్ళు మాట్లాడుకుంటున్నారు. మగాళ్లను అడుగుతున్నారు. వాళ్ళంతా కట్టెల మోపులు అమ్ముకోటానికి వచ్చిన మనుషులే. ఆ బండిలో వాళ్ళందరి అవసరం అదే. ఆ బండిలో కొనుగోలుదారులు వుంటారు. ఆ స్టేషన్లో కట్టెల మోపులు బేరాలు చేస్తారు. కట్టెలు కొనుక్కొని బండిలో వేసుకుని వెళ్ళిపోతారు.

చౌక బేరం. ఒక్కోసారి అక్కడి అడవుల్లో దొరికే చింతపండు, తేనె కూడా అమ్ముతారు. ఆ రైలుబండి రాకపోతే ఆరోజు వాళ్ళందరూ పడే ఆవేదన అంతులేనిది.

ఆ స్టేషన్లో రైలు కొంచెంసేపే ఆగుతుంది. ఏదైనా తనకీ ముట్టేట్టుగా వుంటే రైలు గార్డుదాన్ని మరికొంచెం సేపు ఆపుతాడు. కట్టెలమ్ముకునే మనుషులు వాళ్ళందరికీ కానుకలుగా వాటిని ఇస్తూ వుంటారు.

సూర్యుడు ఆకాశంమీదికి పాకుతున్నాడు. చెట్లమధ్యనించి గాలి ఈల వేస్తున్నట్టుగా సవ్వడి చేసుకుంటూ పరుగులు దీస్తోంది.

స్టేషన్ పక్కనేవున్న చిన్న టీ దుకాణంవాడు కుంపటిమీద టీ మరగబెడుతూ మాటిమాటికీ టన్నెలుకేసి నిక్కి నిక్కి చూస్తున్నాడు.



రోజూ రెండు పూటలా వాడికదే వుద్యోగం. రెండుసార్లే ఆ స్టేషన్‌కు వస్తుంది రైలుబండి. విశాఖపట్నంనించి వచ్చి ఉదయంవేళ ఆ స్టేషన్‌ని వదిలి వెళ్ళిపోతే, కిరండూల్ నుంచి వచ్చే రైలు సాయంత్రానికి అక్కడికి చేరుకుంటుంది. సాయంత్రం వేళ బేరాలు అంత చురుగ్గా వుండవు. అందుకే ఆ సమయంలో ఎక్కువ మంది అక్కడికి రారు

అక్కడికి కొంచెం దగ్గరలోనే వున్న లోయలో చెట్లమీద నించి పొడుగాటి తోకలు వున్న కోతులు ఎగురుకుంటూ వెళుతున్నాయి. చెట్లమీది పక్షులు గోలగా అరుస్తూ ఒక్కసారిగా పైకి లేచాయి. చెట్ల కొమ్మలు వూగుతున్న చప్పుడు.

బరువైన కట్టెల మోపులు నెత్తిమీద పెట్టుకుని పల్లంలోనించి ఎత్తుమీదకు భారంగా నడుస్తూ అక్కడికి వచ్చింది చుక్క.

"ఏటీం తాలీశం?" చుక్క వయసులోనే వున్న ఓ ఆడది అడిగింది.

"ఒల్లకుండు. అదొట్టి మడిశా?" కసురుకుంది ఓ ముసల్ది చుక్కని అడిగిన ఆడదాని మీద.

చుక్క వట్టిమనిషి కాదు. కడుపులో వుంది. తొమ్మిది నెలలూ నిండాయి. చుక్క కడుపులో పెరుగుతున్న బొట్టో, బొట్టెడో, ఏ క్షణానైనా ఈ భూమ్మీద పడొచ్చు. చుక్కకయితే బొట్టి పుట్టాలనే వుంది. బొట్టి గురించే కలలు కంటోన్నది. పుట్టబోయే బొట్టిని తల్చుకునే మొగుడు పెట్టే బాధలన్నింటినీ భరిస్తోంది.

చుక్క మొగుడు తండు మంచివాడు కాదు. వాడికి డబ్బులు కావాలి– రూపాయి, రెండూ అయినా– వాటితో ఆ పాతిక గుడిసెల మధ్యవున్న దుకాణంలో సారాయికొని తాగేసి పాటలు పాడుకుంటూ

స్టేషన్‌లో ఏ చెట్టుకిందనో పడివుంటాడు. కొత్తగా వచ్చిన స్టేషన్ మాస్టరుకు కొండల గురించీ, కోనలగురించీ చెబుతూవుంటాడు. కోపం వచ్చిందంటే చుక్కని చచ్చేట్టు కొడతాడు.

కడుపులో వుండక ముందయితే చుక్క మొగుడు దెబ్బలకు, తన్నులకు భయపడేది కాదు. ఆ తరువాత నుంచయితే భయం మొదలయ్యింది. వాడు పెద్ద మొరటు మనిషి. కోపంలో ఎక్కడ కొట్టేదీ తెలీదు. ఎక్కడయినా తగిలితే లోపలుండే బొట్టికి ప్రమాద మని చుక్క మొగుడు చెప్పినట్లే వింటోన్నది.

అందుకే నడవలేని స్థితిలో కూడా వాడు కొట్టుకొచ్చిన కట్టెల మోపును నెత్తిమీద పెట్టుకుని ఈడ్చుకుంటూ స్టేషన్‌కు వచ్చింది.

అప్పటికీ రైలు రాలేదు.

చెట్టు నీడన బండరాయిమీద కూర్చుంది. చుక్క కట్టెల మోపును చెట్టుకు ఆన్చి.

తాటిముంజెలు అమ్మేవాళ్ళు, పనసతొనలు అమ్మేవాళ్ళుకూడా స్టేషన్లోకి చేరుకున్నారు. అంతా అక్కడి వాళ్ళే. ఆ గుడిసెల్లో మనుషులే. పిల్లలకైతే తాటిముంజెలూ, పనసతొనలూ అమ్మటం బాగా సరదాగా వుంటుంది. అరుచుకుంటూ ఒక్కొక్క పెట్టెనూ దాటుకుంటూ ఎవరు ఎక్కువ అమ్మితే వాళ్ళకంత గొప్ప. వీలయినంత వేగంగా వాటన్నింటినీ అమ్ముకోవాలి. లేకపోతే– ఆ రైలు వెళ్ళిపోతే మిగిలినవన్నీ వృథాఅయినట్టే. వాళ్ళయినా ఎన్నని తింటారు? అన్నీ ఆ కొండల్లో, లోయల్లో విరివిగా దొరికేవే.

బొర్రా గుహల స్టేషన్‌కయినా రైలు వచ్చిందా? ఆ స్టేషన్‌కు వచ్చినా కనపడదు. అదెక్కడో ఏ కొండుల చాటునో వుంటుంది.

కరకవలస స్టేషన్లో రైలాగినా ఆ పై ప్రాంతాల్లోవుండే మనుషులు ఎక్కువగా కట్టెలు, చింతపండు బేరాలు చేస్తారు. దూర ప్రాంతాల నుంచి అరకులోయకు విహారానికి ఆ రైల్లోనే ప్రయాణించే మనుషులైతే తాటిముంజెలు, పనసతొనలు బాగా కొంటారు. చౌకగా దొరుకుతాయి కాబట్టి ఎక్కువగానే కొని తింటారు.

చుక్కి విసుగ్గా టన్నెలుకేసి చూసింది. తొందరగా రైలువస్తే బావుండుననుకుంది. రైలొస్తే ఆ కట్టెల మోపును అమ్ముకుని వెళ్ళిపో వచ్చుననుకుంది. అయినా ఆ రోజు ఎందువల్లనో రైలింకా రాలేదు.

టీ దుకాణం వాడు బీడీ కాల్చుకుంటూ దిక్కులు చూస్తున్నాడు.

ఉన్నట్టుండి రైలు వస్తున్న కూత వినపడింది.

వాళ్ళంతా ఉత్సాహంగా ఒకరినొకరు చూసుకున్నారు. చుక్కి తేలిగ్గా నిట్టూర్చింది.

కొండల శిఖరాలమీద గుట్టపడినట్టున్న చెట్లు ఎండలో గాలికి వూగుతున్నాయి.

స్టేషన్లో సందడి మొదలయ్యింది.

కొంచెం సేపటికే టన్నెల్లోంచి బయటకు దూసుకువచ్చింది కిరండూల్ వెళ్ళే రైలుబండి.

తాటిముంజెలు అమ్మేవాళ్ళు, పనసతొనలవాళ్ళు అరుపులు మొదలుపెట్టారు. ఒక్కసారిగా కట్టెల మోపుల వాళ్ళు వాటిని నెత్తి కెత్తుకుని పెట్టెలవెంట పరుగుతీశారు.

చుక్కి- తన వయసులో వుండి పెళ్ళికాని ఆడవాళ్ళు గబుక్కున మోపులను పైకెత్తుకుని పరుగులుతీస్తూ వెళుతుంటే చిత్రంగా చూసింది. రెండేళ్ళక్రితం తనుకూడా వాళ్ళలాగే అలాగే పరుగులు దీసింది. నిముషాల్లో నాలుగు మోపుల కట్టెలు అలాగ్గా అమ్మేసింది. మరిప్పుడు?

చిన్నగా మోపును నెత్తికెత్తుకుని మెల్లగా ముందుకు కదిలింది.

జనం దిగారు. కొంతమంది టీ దుకాణానికి వెళ్లారు. ఇంకొంత మంది నీళ్ళకోసం వెతుక్కుంటున్నారు. మరికొందరు పనసతొనలూ, తాటిముంజలూ బేరాలు చేస్తున్నారు.

ఒక్కరూ కట్టెలు అడగటం లేదు. మిగిలిన వాళ్ళు అటూ ఇటూ పరుగులు తీస్తూ మోపులను అమ్ముకుంటున్నారు.

చుక్కకి దిగులుగా వుంది– ఎవరూ కొనరేమో!

టీ తాగిన వాళ్ళు రైలెక్కుతున్నారు.

దిక్కులు చూసింది చుక్క.

చాలామంది కట్టెలు అమ్ముతున్నారు.

లేటుగా వచ్చిందనేమో ఆరోజు రైలు ఎక్కువసేపు అక్కడ ఆగలేదు. గార్డు విజిల్ వూదాడు.

సరిగ్గా అప్పుడే చుక్కని అడిగాడు ఓ మనిషి "ఎంత?" అని.

"మూడు" చెప్పింది చుక్క.

"కాదు. రెండుకయితే ఇవ్వు"

"పట్టు"

"ఇదిగో.... ఈ పెట్టెలో వెయ్యి" అతను కడ్డీ పట్టుకుని లోపలకు ఎక్కాడు.

కట్టెల మోపును పెట్టెలో పడేసింది.

అప్పుడు అతను ప్యాంటు జేబులోనించి పర్సును బయటకు తీశాడు.

రైలుబండి పెద్దగా కుదుపుతో ముందుకు కదిలింది.

"డబ్బు.... డబ్బు" అన్నది చుక్క అదుర్దాగా....

అతను చుక్కని చూడలేదు. ఇంకా పర్సులోనించి డబ్బును బయటకు తీస్తున్నట్టే నటించాడు.

చుక్కనిదాటి ముందుకు వెళ్ళింది రైలు. పరుగు తీయబో యింది. కాని సాధ్యం కాలేదు. మళ్ళీ "డబ్బు... డబ్బు" అని అరిచింది.

ప్యాంటూ, షర్టు వేసుకున్న ఆ నాగరిక యువకుడు పర్సులో నించి రెండు రూపాయల నోటును బయటకు తీశాడు. కాని– చుక్కకి ఇవ్వలేదు. ఇవ్వకపోయినా కడుపులోవున్న ఆడది ఏమీ చెయ్యలేదని అతనికి తెలుసు. అందుకే అదోలా నవ్వాడు.

అరుస్తూనే పరుగుదీసింది చుక్క. కాళ్ళకు రాయి తగిలి పడి పోయింది. చిన్న చప్పుడు.

స్టేషన్లోంచి ఎవరో పెద్దగా అరిచారు.

అతను భయంతో ముందుకు వంగి చూశాడు రైల్లోనించి. చుక్క కనపడలేదు. విసురుగా కొట్టిన గాలికి అతని చేతిలోనించి రెండు రూపాయల నోటు ఎటో ఎగిరిపోయింది.

*

(27-12-89 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురితం)